రక్తహీనతను నివారించాలి

ప్రజాశక్తి-కలసపాడు

రక్తహీనత నివారణకు తల్లీ బిడ్డలు పోషకాహారం తప్పక తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి పేర్కొన్నారు. మండలంలోని లింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి ఆధ్వర్యంలో శనివారం పోషకాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోకి వచ్చే ప్రతి బిడ్డకు, తల్లికి పోషకాహార విలువల గురించి తెలియజేయాలని చెప్పారు. రక్తహీనత లేకుండా తల్లులు తమ బిడ్డలను చూసుకోవాలని అన్నారు. అనంతరం 10వ తరగతి ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు బాల్యవివాహాలు చేయకుండా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మా లక్ష్మమ్మ, వర కుమారి, రాధ, రంగమ్మ, దేవి పాల్గొన్నారు.

పొదుపు సంఘాలను పటిష్టం చేయాలి

- కలెక్టర్ వి. విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

జిల్లాలో పేదరిక నిర్మూలన, మహిళా అభివృద్ధి పొదుపు సంఘాల పటిష్ఠతతోనే సాధ్యం అవుతుందని కలెక్టర్ వి. విజయ్ రామరాజు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని విసి హాలులో డిఆర్‌డిఎ, మెప్మా పరిధిలో జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న గృహనిర్మాణ రుణాలు, లైవ్ స్టాక్, స్వయం సహాయక సంఘాల పటిష్టత, వివిధ రకాల పనుల పురోగతిపై పీడీలు ఆనంద్ నాయక్, వై. సురేష్ రెడ్డి లతో కలిసి క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. 'పేదలందరికీ ఇళ్ళు' గృహ నిర్మాణ పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించినా గృహ నిర్మాణాలు బేస్ మెంట్ లెవెల్ ఎందుకు దాటడం లేదన్నారు. మెప్మా పరిధిలో పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా, డిఆర్‌డిఎ పరిధిలో మండలాల్లోనూ చిరు వ్యాపారులకు (స్ట్రీట్ వెండర్లు) స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి పీఎం స్వనిధి, జగనన్న తోడు పథకాలతో పాటు వ్యాపారాభివృద్ధి కోసం గ్రూపుల వారీగా రుణ సదుపాయం కల్పించాలన్నారు. సభ్యులందరికీ పెన్షన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, నివాస గృహాలు అందుతున్నాయా లేదా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులు ప్రతి నెలా పొదుపు, రుణ కంతుల మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు పిఒఎస్ మిషన్లకు కలెక్టర్ చేతుల మీదుగా డిఆర్‌డిఎ అధికారులు పంపిణీ చేశారు. సమావేశంలో డిఆర్‌డిఎ డిపిఎంలు, ఏపీడీలు, డిఆర్‌డిఎ, ఏరియా కో-ఆర్డినేటర్లు సి.సి.లు పాల్గొన్నారు. **పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి** జిల్లాలోని పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి అయినట్లు కలెక్టర్ వి.విజయ్ రామరాజు తెలిపారు.శనివారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ పక్రియ పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 1941 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని ఈ పోలింగ్ కేంద్రాల్లో కొత్తవి కానీ, మెర్జ్ అయినవి కానీ ఏవీ లేవని అన్ని పాత పోలింగ్ స్టేషన్లే ఉన్నాయని తెలిపారు. బద్వేలులో 272, కడపలో 268, పులివెందుల లో 301, కమలాపురం లో 249, జమ్మలమడుగు లో 315, ప్రొద్దుటూరు లో 267, మైదుకూరు లో 269 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. ఇందులో కొన్ని పోలింగ్ కేంద్రాలను మౌలిక వసతులు, ల్యాండ్ ఆక్విజేషన్ రోడ్డు, రోడ్డు వైడనింగ్ లో బాగంగా 124 పోలింగ్ స్టేషన్ల స్థానాలు మారాయని తెలిపారు. అలాగే 264 పోలింగ్ స్టేషన్ల పేర్లను మార్పు చేసినట్లు తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి ఈ ప్రక్రియ పూర్తి చేశామని ఇంకా ఎక్కడైనా పోలింగ్ స్టేషన్లలో సమస్యలు,అభ్యంత రాలుంటే వెంటనే తెలియజేయాలని రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. కార్యక్రమంలో డిఆర్వో గంగాధర్ గౌడ్, స్పెషల్ కలెక్టర్ రామ్మోహన్,కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, శ్రీనివాసులు, వెంకట రమణ, వెంకటేశ్వర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మల్లికార్జున (వైసిపి) బి.హరి ప్రసాద్ (టిడిపి), మనోహర్ (సిపిఎం) కానుగ దానం (బిఎస్‌పి), జి. లక్ష్మణ్ రావు (బిజెపి), ప్రసాద్ గౌడ్ (కాంగ్రెస్), బి శ్రీనివాసులు (ఆప్), శివ, తహశీల్దార్లు, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ జ్ఞానేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. **ఉపాధి హామీ లక్ష్యాన్ని అధిగమించాలి**

కడప అర్బన్ : గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న పేదలకు 100 రోజుల పని దినాలను కల్పించడంలో లక్ష్యాన్ని అధిగమించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు డ్వామా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ స్పందన హాలులో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం అమలు, వివిధ రకాల పనుల పురోగతిపై డ్వామా పీడీ పి.యదుభూషన్ రెడ్డితో కలిసి క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్షించారు. సమావేశంలో అదనపు పథక సంచాలకులు, విజిలెన్స్ అధికారి, కార్యాలయ సిబ్బందితో పాటు అందరూ సహాయ పథక సంచాలకులు, అదనపు కార్యక్రమ అధికారులు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

పిఒఎస్ మిషన్లు అందజేస్తున్న కలెక్టర్ విజయ్ రామరాజు

సత్వర న్యాయ పరిష్కారం కోసమే

'శాశ్వత లోక్ అదాలత్'

ప్రజాశక్తి - కడప

పర్మినెంట్ లోక్ అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానమని, ఫిర్యాదుదారులు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం పొందవచ్చని పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, ం. ప్రదీప్ కుమార్ సంయుక్తంగా పేర్కొన్నారు. శనివారం స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల సమావేశ హాల్ లో 'శాశ్విత లోక్ అదాలత్' ఆధ్వర్యంలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ స్వర్ణ ప్రసాద్ అధ్యక్షతన ప్రజా వినియోగిత సేవా రంగాల్లో న్యాయ సేవలపై నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల లెక్చరర్లు, విద్యార్థులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ 'పర్మినెంట్ లోక్ అదా లత్' అనే వ్యవస్థను ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేశారని తెలిపారు. కడప జిల్లా కోర్టు ఆవరణంలో ఉన్న ఈ వ్యవస్థ రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక చట్టానికి లోబడి ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ పర్మి నెంట్ లోక్ అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమా నమన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కోర్టు ఆవరణలోని పర్మినెంట్ లోక్ అదాలత్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ రెడ్డప్ప, డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ సుబ్బ నరసయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పర్మినెంట్ లోక్ అదాలత్ సభ్యులు ఎం. వి.సుబ్బా రెడ్డి, ఎం. ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం : జడ్జి

ప్రజాశక్తి - కడప

ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎం. ప్రదీప్ కుమార్ అన్నారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను నిషేధించడంతోపాటు విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపే శిక్షాస్పద నిబంధనలు మొదలగు అంశాలపై శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) ఆధ్వర్యంలో రిమ్స్‌లోని మెడికల్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమవుతుందని తెలిపారు. 1997లో తమిళనాడు రాష్ట్రం తొలిసారిగా ర్యాగింగ్‌కు సంబంధించిన చట్టాలను ఆమోదించినట్లు చెప్పారు. ఫండమెంటల్ రైట్స్ అండ్ డ్యూటీ, టోల్ ఫ్రీ నెంబర్లు 100, 108, 1098, 14567, సెక్షన్ 125 సిఆర్‌పిసి, ఉచిత న్యాయ సహాయం గురించి తెలియజేశారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కడప వారి దృష్టికి తీసుకుని రావచ్చన్నారు. కార్యక్రమంలో టీం సభ్యులు సైకియాట్రిస్ట్ డాక్టర్ వెంకట రాముడు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్, డాక్టర్ రాజు, ప్రొఫెసర్లు, మెడికల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పోరు షురూ

ప్రజా'దృష్టి'

ఉపాధ్యాయ ఉద్యమం ఉధృతరూపం దాల్చనుంది. జిల్లా వ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిపిఎస్ వద్దు.. ఒపిఎస్ అమలు చేయాలని కోరుతూ ఉపాధ్యాయలోకం నినదిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతిపక్ష నాయకుని హోదాలో పాదయాత్ర చేస్తున్న సందర్భంగా వైసిపి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ఒపిఎస్ స్కీమ్‌ను అమలు చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని కోరుతూ ఉపాధ్యాయులు నాలుగున్నరేళ్లుగా ఉద్యమిస్తున్నారు. మాట తప్పను.. మడమ తప్పను అనే ప్రచారంతో ప్రజల్ని నమ్మించి అధికారంలోకి వచ్చిన అంశాన్ని ఉపాధ్యాయులు గుర్తుచేస్తున్నారు. అడగని జిపిఎస్‌ను అమలు చేయాలని ఒత్తిడి చేస్తుండడంపై అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో సిపిఎస్‌ను అమలు చేస్తామని ఇచ్చిన హామీని నమ్మి ఓట్లు వేయడంతో రికార్డు మెజార్టీతో అధికారంలోకి వచ్చిన సంగతిని గుర్తు చేస్తోంది. 2024 స్వార్వత్రిక ఎన్నికల్లో సిపిఎస్ హామీని అమలు చేయాలని కోరుతూ చేపట్టిన ఉద్యమం ఎన్నికల అజెండాగా మార్చడంలో సఫలమైన ఉపాధాయయ సంఘాలు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంది. ఉమ్మడి కడప జిల్లాలో సుమారు 12 వేల మందికిపైగా ఉపాధ్యాయులు ఉన్నారు. గతేడాది నిర్వహించిన చలో విజయవాడ జయప్రదమైన సంగతి తెలిసిందే. ఇటువంటి ఉద్యమ స్ఫూర్తిని ఉపాధ్యాయ శ్రేణుల్లో రగిలించాల్సిన బాధ్యత ఉపాధ్యాయ సంఘాలపై ఉంది. జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలన్నీ ఐకమత్యంతో ఉద్యోగుల హక్కుల్ని పోరాడి సాధించుకోవాలి. ఇటువంటి తరహాలోనే కార్మిక, కర్షకుల హక్కుల పోరాట సమయాల్లో శ్రమశక్తులు సంఘీభావాన్ని ప్రకటిస్తూ కార్మిక, కర్షక, హక్కులను సాధించుకోవడానికి దోహదం చేయాలి. శ్రమశక్తులన్నీ సంఘటితమైతేనే పాలక వర్గాలు దిగివచ్చి వాస్తవంలో జీవించే అవకాశం ఉంది. లేనిపక్షంలో కార్మిక, కర్షక, ఉద్యోగుల శ్రమను దోచుకుని ఆశాశ హర్మ్యాల్లో విహరిస్తూనే ఉంటారు. మోసపోయిన వాళ్లు మోసపోతూనే ఉంటారు. లబ్ధి పొందే పరాన్న బుక్కులు శ్రమటోర్చ కుండానే బోక్తలుగా మారి సోమరులుగా తయారవుతూనే ఉంటారు. పోరాటాల ద్వారానే కార్మిక, కర్షక, ఉద్యోగుల హక్కులు సాధించ బడతాయనేది చరిత్ర రుజువు చేసిన సత్యం. శ్రమశక్తుల్లో ముఖ్యంగా ఉద్యోగుల్లో చైతన్యం పాలు అధికం. ఇటువంటి ఉద్యోగ సంఘాలన్నీ ఏకమై తమ హక్కులను సాధించుకునే అంశంలో ఉమ్మడిగా పోరాడాల్సిన ఆవశ్యతను గుర్తెరిగి మసలుకోవాలి. మానవజాతి వికాస పరిణామాల్ని పరిశీలిస్తే చరిత్ర నిండా పోరాటాలు, సంఘర్షణలే ఉన్నాయని తెలుస్తోంది. వీటి ఆధారంగానే మానవజాతి వికాసం, సామాజిక, సాంస్కృతిక పురోగతి సాధించిన ఘట్టాలు సాక్ష్యాలుగా నిలిచిన సంగతిని గమనంలో ఉంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి-కడప ప్రతినిధి

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వి. వెంకటేశ్వర్లు

సామాజిక న్యాయం కోసం 29న మహాధర్నా

- వ్య.కా.స రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు, అసైన్డ్ చట్ట సవరణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29న విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. శనివారం పాత బస్టాండ్‌లోని వ్యవసాయ కార్మికసంఘం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్ అధ్యక్షతన 'దళితుల హక్కులు-సామాజిక న్యాయం' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో,రాష్ట్రంలో పరిపాలన అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల హక్కులు ప్రభుత్వాలు కాల రాస్తున్నాయని విమర్శించారు. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో దాదాపు 45 సంఘాలు కలిసికట్టుగా ఏర్పడి దళితుల అభ్యున్నతి కోసం పనిచేస్తున్నాయని తెలిపారు. దళిత గిరిజనులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను 300 యూనిట్లకు పెంచాలని కోనేరు రంగారావు భూ కమిటీసిఫార్సులను అమలు చేయాలని కోరారు. డప్పుచర్మ కారుల పెన్షన్ రూ.5వేలకు పెంచాలని పేర్కొన్నారు. శ్మశానంలో పనిచేస్తున్న కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడి, ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి తిరిగి అధికారంలోకి వస్తే సావర్కర్ జయంతి రోజున మను సిద్ధాంతాన్ని అమలు చేయడానికి సన్నద్ధమవుతుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ చట్టాన్ని సవరించి భూస్వాములకు మేలు చేస్తుందని విమర్శించారు. సమావేశంలో భూపోరాటసాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ, సిపిఎం.జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి.వి.అన్వేష్, సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, హేతువాద సంఘం జిల్లా కన్వీనర్ సి. ఆర్. వి. ప్రసాద్, సిపిఐ (ఎంఎల్) నాయకులు డబ్ల్యూ. రాము, డి హెచ్ పి ఎస్ నాయకులు మునయ్య, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు గుర్రప్పా, వ్య కా స జిల్లా ఉపాధ్యక్షులు వీరయ్య, నరసయ్య, గోవింద్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, చిన్ని, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్ర, సునీల్, రాహుల్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం

చెన్నూరు : స్థానిక కెఒఆర్ కాలనీలోని ఎపిజిబి ఎదురుగా ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి నిమజ్జనం శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మధ్యాహ్నం ప్రజలకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం బాణాసంచా పేల్చుతూ రంగులు చల్లుకుంటూ యవకులు ఉత్సాహంగా వినాయకుడి విగ్రహాన్ని ఊరేగించారు. అనంతరం పెన్నానదిలో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రూ.34 వేలు పలికిన లడ్డూ

వల్లూరు : వినాయక చవితి వేడుకల్లో భాగంగా మండలంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద శనివారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. పుత్త చిన్నాయపల్లికి చెందిన తప్పెట శ్రీధర్‌రెడ్డి అనే వ్యక్తి లడ్డును కైవసం చేసుకున్నారు. మేళతాళాలతో ఊరేగింపుగా ప్రసాదాన్ని తీసుకెళ్లారు. ఈ సందర్భంగా యువకుడు తప్పెట శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కమలాపురం నియోజవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పుత్త నర్సింహారెడ్డి 2024 ఎన్నికల్లో అధిక మెజార్టీతో గెలిచి ఎమ్మెల్యేగా మన కమలాపురం నియోజవర్గంలో టిడిపి జండా ఎగురవేయాలని గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. **భక్తులకు అన్నదానం..** అనంతరం ఏర్పాటుచేసిన అన్నదానాన్ని ఎస్ఐ పెద్ద ఓబన్న , సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వినాయక కమిటీ సభ్యులు జి. విశ్వనాథరెడ్డి, ఐ. వెంకటసుబ్బారెడ్డి, కె.సుబ్బరామిరెడ్డి, కె.సురేష్ రెడ్డి, ఎన్. జోగిరెడ్డి డి భాస్కర్ రెడ్డి, ఎన్. భాస్కర్‌రెడ్డి, ఎస్.రామకృష్ణారెడ్డి, పి. ఎల్లారెడ్డి, జి. యోగానంద రెడ్డి, జి.భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న తప్పెట శ్రీధర్‌రెడ్డి

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

- యుటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రారంభ వేడుకలను జయప్రదం చేయండి

- రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - చాపాడు

ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన జిపిఎస్‌ను రద్దు చేయించి ఒపిఎస్‌ను కచ్చితంగా సాధించుకుందామని అందుకు ఉపాధ్యాయులు ఐక్య ఉద్యమాలకు సిద్ధంగా కావాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం మైదుకూరులో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మైదుకూరులోని ఉర్దూ హైస్కూల్ ఆవరణలో జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్ యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బద్వేల్ మీదుగా బైక్ ప్రచార యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా యూటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ 'విద్యారంగాన్ని కాపాడుకుందాం.. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించుకుందాం' అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా రెండు టీమ్‌ల ఆధ్వర్యంలో బైక్ జాతా కొనసాగుతుందన్నారు. అక్టోబరు 1న విజయవాడలో సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే స్వర్ణోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. ప్రజా సంకల్ప యాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉపాధ్యాయులకు ఇచ్చిన మాట తప్పారన్నారు. జిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ అమలు చేస్తామని హామీ ఇచ్చి నేడు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒపిఎస్ సాధనకు ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఉద్యోగులకు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే 2024 ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. 49 సంవత్సరాలుగా తెలుగుజాతి కలిసికట్టుగా ఉండాలని పోరాటం సాగిస్తున్న ఏకైక ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ అన్నారు. అక్టోబర్ 1న 17వేల మందితో విజయవాడలో రాబోయే రోజుల్లో చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు మహేష్ రవికుమార్, సద్దాం పాల్గొన్నారు. కార్యక్రమంలో యూటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు విజయ్ కుమార్, మహేష్ బాబు, నాగార్జునరెడ్డి, రవికుమార్, రవీంద్రుడు, మురళీకృష్ణ ,ప్రభాకర్, సివి రమణ, అనిల్ కుమార్, వనమాల రాము, జబ్బర్, చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, జానకిరామ్, మల్లిఖార్జున, రమాదేవి పాల్గొన్నారు. **బద్వేలు :** ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకొనేందుకు యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాటుపడాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల ప్రారంభ ఉత్సవాలను పురస్కరించుకొని చేపట్టిన రాష్ట్రవ్యాపిత బైక్ జాతా కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం బద్వేల్‌కు చేరుకుంది. చెన్నంపల్లె వద్ద యుటిఎఫ్ నాయకులు బైక్ జాతాకు ఆహ్వానం పలికి, పట్టణంలో భారీ మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్దకు చేరుకుని యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఓబుల్ రెడ్డిచే యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, బద్వేల్, గోపవరం, పోరుమామిళ్ల, కాశినాయన మండలాల అధ్యక్షులు టి.శివ ప్రసాద్, వీర దాసరి క్రిస్టఫర్, ఈశ్వరరావు, భాస్కర్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్, రామచంద్రయ్య, సుధాకర్, పి.శ్రీనివాసరెడ్డి, ఎస్.మస్తాన్ వలి, కొండయ్య పాల్గొన్నారు. **కడప అర్బన్ :** యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సంబరాల్లో భాగంగా శనివారం కడపలో జరిగిన బైక్ జాతాలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. రాజంపేట రోడ్డులోని వైఎస్ఆర్ సర్కిల్ నుంచి వై జంక్షన్, యర్రముక్కపల్లి సర్కిల్ మీదుగా బాలాజీ నగర్‌లోని యుటిఎఫ్ భవన్ వరకు జాతా నిర్వహించారు. యుటిఎఫ్ భవన్ వద్ద జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు జెండా ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులు కె. సురేష్ కుమార్ మాట్లాడుతూ కార్యక్రమంలో గోపినాథ్, కిరణ్ కుమార్, చంద్ర శేఖర్, విజయ కుమార్, జానకి రామ్, నాగరాజు, హిపాజితుల్లా, జి.వెంకట సుబ్బయ్య, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్,డి. నగర కార్యదర్శి ఎం.ఓబులేసు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గండి సునీల్ కుమార్, సగిలి రాజేంద్ర జాతాకు ఆహ్వానం పలుకుతూ సంఘీభావం తెలియజేశారు.

బద్వేల్ : బైక్ జాతా నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పంటల బీమాను 'ప్రయివేట్'కు అప్పగించొద్దు

- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిఒ ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి- కడప అర్బన్

2023-24 పంటల బీమాను ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించవద్దని, రాష్ట్ర ప్రభుత్వమే తన బాధ్యతగా పంటల బీమా పథకాన్ని నిర్వహించాలని ఎపి రైతుసంఘం, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పాత బస్టాండ్ ఆవరణంలో జిఒ 660 కాపీలు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శలు బి. దస్తగిరి రెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ పంటల బీమా పై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ 660ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంటల బీమాలో ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రవేశం నిలిపివేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే పంటల బీమా అమలు చేయాలని కోరారు. 2023-24 ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమా అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలతో బిడ్డింగ్ నిర్వహించిందని చెప్పారు. పంటల బీమా విధానం రైతులకు నష్టం చేసేదిగాను, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రయోజనాల కొరకు ఉపయోగపడేదిగా ఉందన్నారు. పంటల బీమాలో ఇన్సూరెన్స్ కంపెనీల ప్రమేయం లేకుండా ప్రభుత్వమే పంటల బీమా పథకం అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వత్తిడికి లొంగి పంటల బీమా పథకంలో ఇన్సూరెన్స్ కంపెనీలను అనుమతించవద్దన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పాలసీ ఇన్సూరెన్స్ కంపెనీల లాభాల కొరకే తప్ప రైతుల ప్రయోజనం కొరకు కాదని విమర్శించారు. సమగ్ర పంటల బీమా పథకం తీసుకువచ్చి అన్ని పంటలకు పంటల బీమా వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాల కృష్ణయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, జిల్లా నాయకులు రామ్మోహన్, చంద్రారెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, నగర కార్యదర్శి ఓబులేష్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జిఒ కాపీలు దగ్ధం చేస్తున్న రైతు సంఘం, సిఐటియు నాయకులు

నిరుద్యోగ సమస్యలపై చర్చించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యపై మాట్లాడాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గడిచిన నాలుగు సంవత్సరాలలో ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా వదల లేదన్నారు. డిఎస్‌సి, గ్రూప్స్ లేవని, వదిలినా తక్కువ పోస్టులతో సరిపెట్టాలని చూస్తున్నారని వాపోయారు. ఉద్యోగాల కోసం వేల రూపాయలు ఖర్చు పెట్టుకుని కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకున్నారని పేర్కొన్నారు. ఉద్యోగాలు రాలేదనే మనో వేదనతో ముఖ్యమంత్రి సొంత జిల్లాలో నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పదుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు అందుకు కొద్ది రోజుల కిందట మైలవరం మండలంలో ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డమే కారణమని చెప్పారు. తక్షణమే రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలలో నిరుద్యోగ సమస్య పై చర్చ జరపాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో మెగా డిఎస్సీ ప్రకటన చేయాలని, గ్రూప్-2 పోస్టుల సంఖ్య పెంచాలని కోరారు. లేకుంటే రాబోవు రోజులలో నిరుద్యోగులు ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు షాకీర్, డి.ఎం.ఓబులేసు, నగర ఉపాధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.

26న చలో కలెక్టరేట్ : ఎస్ఎఫ్ఐ

కడప అర్బన్ : విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఈ నెల 26న భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో కలెక్టరేట్‌ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండి సునీల్ కుమార్, సగిలి రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు నిత్యం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. విద్యార్థులకు పెండింగులో ఉన్న జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడి బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తరుణంలో రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై చర్చించకుండా కాల యాపన చేస్తున్నారని తెలిపారు. నాలుగున్నరేళ్ళ వైసిపి హాయాంలో విద్యారంగంలో అనేక సమస్యలు తిష్ఠ వేశాయని ఆరోపించారు. ఇంటర్ చదువుకునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. పేద విద్యార్థులకు బాసటగా ఉండే సంక్షేమ వసతి గృహాలు స్వంత భవనాలు లేక ఉన్న ప్రభుత్వ భవనాలలో సరైన వసతులు లేక విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు రాహుల్, రవి, జిల్లా నాయకులు మోహన్ పాల్గొన్నారు.

పాత పెన్షన్‌ను ఇచ్చి తీరాల్సిందే : ఫ్యాప్టో

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని, అందుకు ప్రత్యామ్నాయంగా అమలు చేస్తున్న జిపిఎస్ విధానాన్ని అంగీకరించే ప్రశ్నే లేదని ఫ్యాప్టో కడప జిల్లా చైర్మన్ మాదన విజయ కుమార్ పేర్కొన్నారు. మంత్రి మండలి సమావేశంలో జిపిఎస్ బిల్లును ఆమోదించడానికి నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు శనివారం పాత తాలూకా కేంద్రమైన కడపలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాదన విజయకుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి తాను అధికారంలోకి వస్తే వారంలోపే సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న హామీని నమ్మి ఉద్యోగ, ఉపాధ్యాయులు జగన్మోహన్ రెడ్డిని గద్దెనెక్కించారని తెలిపారు. ఉద్యోగుల అండదండలతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి ఉద్యోగులకు ఇచ్చిన హామీని విస్మరించడం తగదన్నారు. సిపిఎస్, జిపిఎస్ దొందూ దొందేనని, జిపిఎస్ వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒరిగేదేమీ లేదన్నారు. సిపిఎస్ రద్దు, పాత పెన్షన్ అమలు విషయంలో ప్రభుత్వం మాట తప్పిందని బహిరంగంగా చెప్పే ధైర్యం ఈ ప్రభుత్వానికి ఉందా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తప్పుడు ఆలోచనలు మానుకుని, ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. జిపిఎస్ బిల్లును ఆమోదించడాన్ని నిరసిస్తూ ఈనెల 25న ఫ్యాప్టో ఆధ్వర్యంలో తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఇలియాస్ బాషా, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్, బిటిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఆర్.హరి కొండయ్య, నాయకులు మోహన్ రెడ్డి, రెడ్డన్న, మస్తాన్ బాబు, వీర ప్రతాప్, శ్రీనివాసులు, బాబు, కరిముల్లా, ఖాదర్ పాల్గొన్నారు.

ఉమైర్ రెసిడెన్సీకి భూమిపూజ

కడప : నగరంలోని అఫ్జల్ ఖాన్ కాలనీలో శనివారం ఉమైర్ రెసిడెన్సీ భూమి పూజ కార్యక్రమానికి డిప్యూటీ సిఎం అంజాద్‌బాష, మేయర్ సురేష్ బాబు, వైసిపి కడప నియోజకవర్గ సీనియర్ నేత, రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రెసిడెన్సి బ్రోచర్లను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు సుబ్బా రెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ పులి సునీల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు సుబ్బారెడ్డి, తోట కృష్ణ, పాల్గొన్నారు.

ఎస్‌జిఫ్ అండర్-19 ఎంపికలు

కడప అర్బన్ : కోడూరు ఆర్ఎస్ క్రీడా ప్రాంగణంలో ఎస్‌జిఎఫ్ అండర్-19 జిల్లాస్థాయి క్రీడా ఎంపికలు శనివారం నిర్వహించారు. కడపకు చెందిన విద్యార్థులు విజయం సాధించి రాష్ట్రస్థాయికి అర్హత పొందారు. కోడూరు రవిశంకర్ మాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన తేక్వాండో, కరాటే పోటీల్లో వై. లోక నితిన్ కుమార్ రెడ్డి, ఎం. సాయి యోగేష్ విజయం సాధించారు. వీరి విజయం పట్ల కోచ్ వెంకటేష్ ఆనందం వ్యక్తం చేశారు.



రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులతో కోచ్ వెంకటేష్

కుందూ నదిలో పెరిగిన నీటి మట్టం

ప్రజాశక్తి - చాపాడు

కుందూ నదిలో శనివారం నీటిమట్టం పెరిగింది. గత పది రోజుల క్రితం నదిలో అధిక నీరు ప్రవహించి క్రమేపి తగ్గుతూ శుక్రవారం వరకు చిన్న పాటి జాలు నీరు ప్రవహించేది. వినాయక నిమజ్జనానికి కూడా సరిపడే నీరు లేకపోవడంతో విగ్రహాలు ఎక్కువగా బయటకు కనిపించేవి. శుక్రవారం రాత్రి కుందూ నదికి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి నీటి ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం నదిలో 8వేల క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తోంది. నాలుగు రోజులుగా వినాయక నిమజ్జనం సందర్భంగా నదిలో వేసిన విగ్రహాలు పూర్తిగా నీటిలో మునగడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కుందూ నది తీర గ్రామాల్లో వరి, ఇతర పంటలు సాగుచేసిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆయుష్ వైద్యంపై ప్రజలకు అవగాహన

జమ్మలమడుగు : ఆయుష్ వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు జమ్మలమడుగు ఆయుష్ వైద్యులు డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. శనివారం పట్టణంలోని నాలుకట్ట వీధిలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఆయుష్మాన్‌భవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా మందులను పంపిణీ చేశామన్నారు. ఉచిత హెల్త్ చెకప్, మందులు అందజేశామన్నారు. మోకాళ్ల నొప్పులు, చర్మ, బిపి, షుగర్ మొదలగు రోగులకు ఉచితంగా మందులు అందించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, యోగా స్పెషలిస్ట్ లక్ష్మిరాజు, తిరువెంగళమ్మ, ఆశా వర్కర్లు, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది : చల్లా రాజగోపాల్

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : అన్నదానం దైవ కార్యమని చల్లా రాజగోపాల్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్వర్ హాల్ వద్ద సీమాంధ్ర బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం దాదాపు 800 మందికి రుచికరమైన భోజనం పెట్టారు. కార్యక్రమంలో మూరబోయిన శ్రీనివాస్ యాదవ్, రామచంద్ర రాజు, నల్లం రవిశంకర్, సీతంపల్లి రమణ, జయచంద్ర, శ్రీనివాసులు, యేసునాథరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, బోడె ప్రసాద్, శివ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

జమ్మలమడుగు రూరల్ : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో పాతబస్టాండ్‌లో చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 11వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో మైలవరం మండలం నాయకులు కొండయ్య, పాపిరెడ్డి, నారాయణరెడ్డి, సుబ్బరాయుడు, నాగరాజు, కిరణ్, మునిశేఖర్ కూర్చున్నారు. ఈ దీక్షలను భూపేష్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, శివనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబం అభిమానులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా 'బాబుతో నేను' అంటూ పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని భూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ జయరామిరెడ్డి, మండలశాక అధ్యక్షులు మోహన్‌రెడ్డి, నాయకులు రమేష్‌రెడ్డి, బయపురెడ్డి, సంజీవరెడ్డి, రాజారెడ్డి, సేట్, సుంకర నాగేశ్వరరావు, టైలర్ మాబు, శివారెడ్డి, అబ్దుల్, కొండారెడ్డి, దానం, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త నమూనా పరీక్షలు

పులివెందుల రూరల్ : ఎస్‌డిజి కార్యక్రమంలో భాగంగా మునిసిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి, డాక్టర్ ఫర్జానా ఆధ్వర్యంలో శనివారం గవర్నమెంట్ మహిళా డిగ్రీ కళాశాలలో 210 మంది విద్యార్థినులకు రక్త శాతం పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ పరీక్షల వల్ల శరీరంలో రక్త శాతం తక్కువగా ఉన్న విద్యార్థినులకు హిమోగ్లోబిన్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేశారు. రక్త శాతం పెరుగుదలకు తీసుకోవాల్సిన ఆహారం గురించి తెలిపారు. ప్రిన్సిపల్ బాల నారాయణ, సిబ్బంది, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వైద్య విద్యకు దూరమవుతున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో వైద్య విద్యకు విద్యార్థులు దూరం చేస్తోందని, కొత్తగా తీసుకొచ్చిన జిఒ నం. 107,108 రద్దు చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.ఆంకన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని తమ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని రీతిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ సీట్లను అమ్ముకుంటున్నారు. ప్రతిభ కలిగిన వారికి, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటా సీట్ల తగ్గింపును విరమించుకోవాలన్నారు. జిఒ 107, 108ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పిడిఎస్‌యు జిల్లా నాయకుడు స్వరూప్ తేజ, పట్టణ నాయకుడు యశ్వంత్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలి

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చే జిపిఎస్ బిల్లును ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, వారంతా కోరుకుంటున్నది పాత పెన్షన్ విధానమేనని ఎపి రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధిళ్ళ సుబ్బరాజు యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఎస్‌టియుఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.విద్యాసాగర్ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్‌లోని ఫెడరేషన్ కార్యాలయంలో జిపిఎస్ బిల్లులను వ్యతిరేకించాలని విజ్ఞాపన ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బరాజు యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాదయాత్ర సమయంలో సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో అమలు చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో కొత్తగా జిపిఎస్ అమలు చేయడం చాలా అన్యాయమన్నారు. జిల్లా కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య, నాయకులు మునిశేఖర్, కుంచం వెంకటేష్, లక్ష్మీ నారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.

'మా ఊరి సినిమా' ప్రోమో సాంగ్ విడుదల

పులివెందుల రూరల్ : పట్టణంలోని నారాయణ కాలేజీలో శనివారం మా ఊరి సినిమా రెండవ పాటను విద్యార్థినుల మధ్య ప్రోమో సాంగును హీరో మహేష్, హరి, టీం సభ్యులు చంద్రమోహన్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, పవన్, రాజు, శివ మధ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో మహేష్ మాట్లాడుతూ మా ఊరి సినిమాను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ యూట్యూబ్‌లో ఎంటర్‌టీ మ్యూజిక్ చానల్‌ను ఓపెన్ చేసి పాటలు చూడాలన్నారు. ఈ పాట ఈనెల 25న ఉదయం 11 గంటలకు లాంచ్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు, రామలక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెద్దముడియం : మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో శివప్రసాద్ అనే వాలంటీర్ తండ్రి బొందల శివయ్య(54) కడుపు నొప్పి తాళలేక ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. కొంతకాలం క్రితం శివయ్యకు కడుపునొప్పికి ఆప రేషన్‌తోపాటు ఇటీవలే కంటి ఆపరేషన్ కూడా చేయించుకున్నాడు. ఈ క్రమంలో శనివారం కడుపునొప్పి తీవ్రం కావడంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రామకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మల మడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ప్రొద్దుటూరు : మేఐహెల్ప్‌యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం రెండు మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఈశ్వరరెడ్డినగర్ గంగమ్మగుడి వద్ద మద్దిలేటి అనే యాచకుడు మృతి చెందాడు. అమ్మనాన్న వృద్ధాశ్రమంలో బండారు చెంచమ్మ (82) మృతి చెందింది. వీరి అంత్యక్రియలకు ఎవరూ రాకపోవడంతో ఫౌండేషన్ చైర్మన్ మోరె లక్షణ్‌రావు స్పందించారు. కృపఅగ్నిశరూన్ ట్రస్ట్ చైర్మన్ పాపిశెట్టి వెంకటలక్షుమ్మ, సుమన్‌బాబు, భార్గవ్‌సాయి, మునిసాయి, శ్రీరామ్, సుబహాన్ పాల్గొన్నారు.

ఆహ్లాదాన్నివ్వని పార్కు

పారిశుధ్య లోపం - ఎలుకల సంచారం

తిరుగుతున్న ఎలుక

తొర్ర ఏర్పడిన బల్ల

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రస్తుత వత్తిడి సమాజంలో బి.పి., మధుమేహవ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉంటున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో ఒక గంట పాటు వాకింగ్, జిమ్ చేస్తే ఆహ్లాదకరంతోపాటు ఉపశమనం కలుగుతుందని పార్కుకు వస్తే ఇక్కడ అంత సౌకర్యవంతంగా లేదని వాపోతున్నారు. పారిశుధ్యం కరువై ఎక్కడపడితే అక్కడ చెత్తదర్శనమిస్తోందని పేర్కొంటున్నారు. పార్కులో మనుషులతోపాటు ఎలుకలు కూడా వాకింగ్ చేస్తున్నాయని అంటున్నారు. స్థానిక అనిబిసెంట్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిమ్ పాయింట్‌లో పారిశుధ్యం అటకెక్కింది. జిమ్‌లో ఉన్న పరికరాలు కూడా దెబ్బతిన్నాయి. సమస్య దాదాపుగా ఆరేళ్లుగా ఉన్నా పట్టించుకునేనాధుడే కరువయ్యారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట గాంధీ పార్కును ఇటీవల హోం మంత్రి ప్రారంభించారు. కాని ఇతర పార్కుల పరిస్థితిని పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. భుజాల నొప్పులు నయమయ్యేందుకు ఏర్పాటు చేసిన రెండు చక్రాల్లో ఒక దాని పిడి ఊడిపోయింది. పక్కనే ఉన్న బల్ల కూడా దెబ్బతింది. పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతోపాటు దెబ్బతిన్న పరికరాల స్థానంలో మార్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై డిఇ ప్రభాకర్‌దాసును వివరణ కోరగా.. ఎఇ సెలవుపై వెళ్లారని, వారంరోజుల్లో సరిచేస్తామని అన్నారు.

సాగునీటిని నిర్లక్ష్యం చేయడం చారిత్రాత్మక తప్పిదం

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వం సాగునీటి రంగాలను నిర్లక్ష్యం చేయడం చారిత్రాత్మక తప్పిదమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ప్రధానమైన రాష్ట్రమన్నారు. వ్యవసాయానికి సాగునీటి రంగం గుండెకాయ లాంటిదని చెప్పారు. 2004-2014 మధ్య కాలంలో సాగునీటి రంగాలకు కాంగ్రెస్ ప్రభుత్వాలు అధిక ప్రాముఖ్యతనిచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో సాగునీటి రంగానికి 15-17 శాతం నిధులు కేటాయించి ఖర్చు చేసేవని తెలిపారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, ప్రకాశం, ధవళేశ్వరం బ్యారేజీలు కాంగ్రెస్ పాలనలోనే పూర్తయ్యాయన్నారు. జలయజ్ఞంలో తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలుగొండ, పులిచింతల ప్రాజెక్టుల సింహభాగం పూర్తి చేసినట్లు తెలిపారు. దురదృష్టవశాత్తూ రాష్ట్ర విభజన తర్వాత సాగునీటి రంగాలకు తెలుగుదేశం ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో 9 శాతానికి తగ్గించి కొంతమేర నిర్లక్ష్యం చేసినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. బడ్జెట్ కేటాయింపులు 5 శాతానికి తగ్గించిందన్నారు. కేటాయించిన నిధుల్లో కూడా 31 శాతమే ఖర్చు చేసిందన్నారు. నాలుగేళ్లలో రూ.61,573 కోట్లు కేటాయించి రూ.19,199 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం చారిత్రక తప్పిదమని తులసిరెడ్డి విమర్శించారు. నిధులు లేని కారణంగా ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నడంతోపాటు మరమ్మతులకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, సస్యశ్యామలం కావాలంటే కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సి ఉందని తులసిరెడ్డి వివరించారు.

మాట్లాడుతున్న తులసిరెడ్డి

గ్రావెల్ రోడ్డు బిల్లు స్వాహా..!

ప్రజాశక్తి - ముద్దనూరు

ఉప్పులూరు గ్రామ పంచాయతీ డిడిఒ, కార్యదర్శి రెహమాన్ చేతి వాటం చూపిస్తూ చేతికి అందినంత దోచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ కార్యదర్శి దేనేపల్లె, యామవరం, కొలవలి గ్రామ పంచాయతీలకు ఇన్‌ఛార్జి డిడిఒగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో కూడా ఆయనపై ఉద్యోగులు, ప్రజలు నుండి పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. సెలవులో ఉన్న ఉద్యోగులకు జీతాల బిల్లులు మంజూరు చేసి పర్సెంటేజి తీసుకుంటారనే ఆరోపణలు ఉన్నాయి. మెటర్నరి సెలవుపై వెళ్లిన సచివాలయం మహిళ ఉద్యోగులకు బిల్లులు మంజూరు చేయాలంటే పర్సెంటేజీ ఇవ్వాల్సిందేనని పలువురు పేర్కొంటున్నారు. తాజాగా డిడిఒ గ్రావెల్ రోడ్డు బిల్లు సొమ్ము స్వాహా చేసిన ఘటన వెలుగు చూసింది.

దేనేపల్లె గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ శివారెడ్డి 2019లో ఆరవేటిపల్లె నుండి చింతకుంట వరకు 2కిలో మీటర్లు రూ.16 లక్షలతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా బిల్లులు రాకపోవడంతో సదరు కాంట్రాక్టర్ పంచాయతీ రాజ్ అధికారులను ఆశ్రయించారు. అధికారులు రికార్డులు పరిశీలించి ప్రభుత్వం బిల్లు మంజూర్ చేసి దేనేపల్లె గ్రామ పంచాయతీ ఖాతాలో రూ.6లక్షల 82 వేలు జమ చేసినట్లు తెలిపారు. దేనేపల్లె గ్రామ పంచాయతీ ఖాతాలో జమ అయిన సొమ్మును ఇన్‌ఛార్జి డిడిఒ రెహమాన్ మొదటిసారి 2023 జనవరి 27న ఉప్పలూరు గ్రామ పంచాయతీకి బదిలీ చేసి కాజేశారు. రెండోసారి 2023 మార్చి 7న రాయపాటి షకినాబీ ఖాతాకు రూ.4లక్షల 70వేలు బదిలీ అయింది. మూడవ సారి రాయపాటి షకినాబీ ఖాతాలో మరో రూ.30వేలు నగదు బదిలీ అయింది. **బిల్లు సొమ్ముపై కాంట్రాక్టర్ ఆరా తీయగా..** డిడిఒ రోడ్డు బిల్లు సొమ్ము స్వాహా చేసినట్లు తెలుసుకున్నారు. విషయాన్ని బాధిత కాంట్రాక్టర్ ఎంపిడిఒ సూర్య నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కార్యదర్శి రెహమాన్‌పై పలు అవినీతి ఆరోపణలు తరచూ వస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు విమర్శిస్తున్నారు.

విచారించి తగు చర్యలు తీసుకుంటాం

డిడిఒ, కార్యదర్శి రోడ్డు బిల్లు సొమ్ము కాజేసినట్లు కాంట్రాక్టర్ ఫిర్యాదు చేశారు. వారం రోజులుగా డిడిఒ రెహమాన్ విధులకు హాజరు కాలేదు. విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- సూర్యనారాయణరెడ్డి, ఎంపిడిఒ

ఉన్నతాధికారులు న్యాయం చేయాలి

అప్పు చేసి పెట్టుబడి పెట్టి రోడ్డు ఏర్పాటు చేశాను. ఇందుకు సంబంధించిన బిల్లు సొమ్ము ఒక్క రూపాయి కూడా రాలేదు. తనకు రావాల్సిన సొమ్ము డిడిఒ స్వాహా చేశారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలి. అవినీతికి పాల్పడిన కార్యదర్శిపై తగిన చర్యలు తీసుకోవాలి.

- శివారెడ్డి, కాంట్రాక్టర్

తప్పు చేస్తే ప్రజలు క్షమించరు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు

తప్పు చేసిన వారిని ప్రజలు సమర్థించరని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో టిడిపి ఎమ్మెల్యేలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. స్కిల్ స్కాంలో చంద్రబాబు అవినీతిపై చర్చిస్తామని స్పీకర్ అనుమతిస్తున్నప్పటికీ టిడిపి ఎమ్మెల్యేలు ముందుకు రావడంలేదన్నారు. సభ ఉల్లంఘనకు పాల్పడుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, దీన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని సరైన ఆధారాలతోనే సిబిసిఐడి అరెస్టు చేసిందన్నారు. కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని చేతివృత్తుల వారికి శిక్షణ ఇచ్చినట్లు చూపారని తెలిపారు. చంద్రబాబును అరెస్టు చేసిన తర్వాత ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి అల్లర్లు చేయాలని పిలుపునిచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. అల్లర్లు సృష్టించి జగన్‌ను ఓడించాలన్న భ్రమలో టిడిపి నాయకులు ఉన్నారన్నారు. టిడిపి నాయకులు పవన్‌కళ్యాణ్‌ను నమ్ముకుని రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్షుమయ్య, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, గృహసారధుల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

సేవా కార్యక్రమాలతోనే సమాజాభివృద్ధి

వేంపల్లె : స్వచ్ఛంద సేవా సంస్థలు చేపట్టే కార్యక్రమాలతో సమాజా భివృద్ధి చెందేందుకు అవకాశం ఉందని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సంధ్యారాణి చెప్పారు. శనివారం మండలంలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో జాతీయ సేవా సమితి కో-ఆర్డినేటర్‌గా పని చేసిన కోటేశ్వరి కోశాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కోటేశ్వరిని డైరెక్టర్ సంధ్యారాణి, ఒఎస్డీ గంగిరెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను మరింత ఉధృతం చేయాలని కోరారు. జాతీయ సేవా సమితి కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన మధుసూదన్‌రెడ్డి కూడా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల్లో చైతన్య తెచ్చేలా సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి రాంభూపాల్‌రెడ్డి, అకాడమిక్ డీన్ రత్నకుమారి, మాజీ ఎఒలు అమరేంద్ర, కొండారెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ విశ్వనాథరెడ్డి, డాక్టర్ దీప్తి, డాక్టర్ రాము, రామసుబ్బయ్య, అనూషరాజ్, డాక్టర్ రమేష్, అధ్యాపకులు , సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : కొంత కాలంగా అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక సంఘం (సిఐ టియు అనుబంధం) ప్రొద్దు టూరు శాఖ ప్రధాన కార్యదర్శి సాల్మన్ కోరారు. రాష్ట్ర సంఘ పిలుపుమేరకు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట రెండోరోజు ధర్నా చేప ట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ గతంలో ప్రతి పక్షంలో ఉన్నప్పుడు, అనంతరం అసెంబ్లీ సమావేశాల్లో గత తెలుగుదేశం ప్రభుత్వం మోసం చేసిందని, తాము అధికారంలోకొస్తే మున్సిపల్ కార్మికులనందరినీ పర్మినెంట్ చేస్తామని తెలిపారని గుర్తు చేశారు. కార్మికులకు జీతం లక్ష రూపాలు ఇచ్చినా తక్కువే అని ఆపని ఎవరూ చేయరని పాదయాత్ర సందర్భంగా చెప్పార న్నారు. ఇలా ముఖ్యమంత్రి జగన్ చెప్పి నేటికి ఆరేళ్లవుతోందన్నారు. ధర్నాలో కార్మి కులు రవికుమార్, శ్రీకాంత్, లుకాయ, భాస్కర్, జీవరత్నం, హరిబాబు, ఎలీష పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

చక్రాయపేట : శాశ్వత అన్నదాన పథకానికి మండలంలోని గడ్డంవారిపల్లి గ్రామం తొట్టికాడపల్లికి చెందిన వసంత్ రామకృష్ణారెడ్డి వారి ధర్మపత్ని రాధిక కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళం ఇచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. ఈ సందర్భముగా ముకుందరెడ్డి మాట్లాడుతూ నిత్య అన్నదాన కార్యక్రమానికి విరాళాలు అందించిన దాతలకు పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతాభినందనలు తెలిపారు.

ఉండవల్లికి వైసిపి ప్రభుత్వంలో దోపిడీ కనపడలేదా?

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న దోపిడీ ఉండవల్లికి కనపడలేదా అని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు బాల స్వామిరెడ్డి ప్రశ్నించారు. శనివారం వేంపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ వైసిపి పాలనలో పబ్లిక్‌గా వేల కోట్లు దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులు వేల కోట్ల రూపాయలను దోపిడీ చేస్తున్న విషయం ఉండవల్లికి కనబడకపోవడం దురదృష్టకరమన్నారు. ఇసుక, మద్యం, గనుల శాఖకు చెందిన టెండర్లకు సంబంధించి లెక్కలు వేస్తే ప్రతి రోజూ వేల కోట్ల రూపాయలు దోపిడీ జరుగుతున్నట్లు చెప్పారు. జిఎస్‌టి ఎంత వసూలు చేస్తున్నదని ఉండవల్లి కనబడకపోవడం విచిత్రంగా ఉందన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు అల్లాబకష్, పివి రమణ, శేషారెడ్డి, కృష్ణారెడ్డి, డివి సుబ్బారెడ్డి, గోటూరు నాగభూషణం, మహబూబ్ షరీఫ్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ ఆదేశాల మేరకు వారాంత సమీక్షా సమావేశంలో భాగంగా మహిళా సంరక్షణ కార్యదర్శులతో అర్బన్ పోలీస్‌స్టేషన్లో సిఐ రాజు, ఎస్ఐలు హుస్సేన్, సత్యనారాయణ శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మహిళా సంరక్షణ కార్యదర్శులు వారి పరిధిలోని ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ముందస్తు సమాచారం సేకరించాలని తెలిపారు. బాల్య వివాహాలు, భూ వివాదాలు, నీటి వివాదాలు వంటి వాటిని ముందుగానే గుర్తించాలన్నారు. నేరాలను నివారించుటలో ప్రధాన భూమిక పోషించాలని మహిళా సిబ్బందిని ఆదేశించారు.

స్వచ్ఛ పురపాలకగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలి

- మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ సర్వేక్షన్ 2023, ఇండియన్ స్వచ్ఛత. లీగ్(ఐఎస్ఎల్-2.0) కార్యక్రమంలో భాగంగా శనివారం మునిసిపల్ చైర్మన్ వి వరప్రసాద్, మునిసిపల్ వైస్ చైర్మన్ ఎస్. హాఫీజుల్లా, మునిసిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డి, శానుటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. భాకరాపురంలో ఉన్న వెంకటప్ప మెమోరియల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులతో స్వచ్ఛ సర్వేక్షన్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పార్థపల్లి కిషోర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి పేర్కొన్నారు. మండలంలోని సింహాద్రిపురం, జంగంరెడ్డి పల్లి, హిమకుంట్ల అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడంతో పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషక ఆహారాన్ని సద్వినియం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు చియ్యపాడు ఆలయ పునరుద్ధరణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - చాపాడు

జిల్లాలో ప్రసిద్ధి చెందిన మండల పరిధిలోని పెద్ద చియ్య పాడు గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయ పునరుద్ధరణ పనులకు కమిటీ సభ్యులు నిశ్చయించారు. మైదుకూరు శాసనసభ్యులు ఎస్.రఘురామిరెడ్డి ఆలయ పునరుద్ధరణకు కృషి చేస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణలో భాగంగా ఆదివారం ముహూర్తం ఖరారు చేశారు. ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ ద్వారా రూ.61లక్షల నిధులు మంజూరైనట్లు ఆలయ చైర్మన్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చియ్యపాడు పురాతన దేవాలయం

దుకాణాలకు లైసెన్సులు పొందాలి

వేంపల్లె : దీపావళి పండుగ సందర్భంగా టపాకాయల విక్రయాల కోసం దుకాణాలను పెట్టే వ్యాపారస్తులు లైసెన్సులు పొందాలని తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. టపాసుల కొత్త లైసెన్స్‌కు ఫారం ఎల్‌ఇ-5, లైసెన్స్‌కు ఫారం-ఎఇ 5లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గతేడాది ఫారం ఎల్‌ఇ -5 లైసెన్సులు పొందిన వ్యక్తులు రెన్యూవల్‌కు ఫారం ఆర్‌ఇ-1తోపాటు రూ.500 (సిఎస్‌ఎంఎస్) చలనా చెల్లించాల్సి ఉందన్నారు. దరఖాస్తులను నవంబర్ 3లోగా రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్ సూచించిన ప్రదేశంలోనే టపాకాయలు విక్రయాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని ఆయన సూచించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

జమ్మలమడుగు రూరల్ : బాలబాలికలు అనే వ్యత్యాసం లేకుండా విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని బార్ అసోషియేషన్ సభ్యులు, న్యాయవాది భూతమాపురం వెంకట సుబ్బారావు సూచించారు. విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. స్థానిక మోరగుడి జిల్లా పరిషత్ పాఠశాలలో జడ్జి భార్గవి ఆదేశాల మేరకు శనివారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలికే పరిమితం కాకుండా సమాజంలో జరిగే సంఘటనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏది తప్పో, ఏది ఒప్పో తెలుసుకొని నడుచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే చక్కటి విద్యాబుద్ధులను అలవర్చుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. పిల్లల వయసు పెరిగేకొద్దీ వారు నడుచుకోవాల్సిన విషయాలపై చక్కటి అవగాహన కల్పించారు. అనతరం ప్రధానోపాధ్యాయులు న్యాయవాదులకు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో న్యాయవాదులు రామ్మోహన్, ముసీదా, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

ఐక్యంగా బాల్య వివాహాలను అరికడదాం

పులివెందుల రూరల్ : ఐక్యంగా బాల్య వివాహాలు అరికడదామని మున్సిపల్ చైర్మన వరప్రసాద్ కోరారు. పట్టణంలో మునిసిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆధ్వ ర్యంలో శనివారం మెప్మా సంఘ సభ్యులతో కలిసి బాల్య వివాహాలను అరికడ దాం అనే అంశంపై భారీగా ర్యాలీ నిర్వహించారు. బాల్యవివాహాలపై పోలీ సులకు, చైల్డ్ కేర్ సెంటర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతారన్నారు. కార్యక్రమానికి ఐసిడిఎస్ సిడిపిఒ లత, మెప్మా సిబ్బంది నాయుడు, నాగన్న, ఆర్పీలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతిని దోచుకొంటున్న దువ్వూరు ఎంపిపి

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : దువ్వూరు ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి ప్రకృతిని దోచుకుంటున్నారని, ఆయన అక్రమాలు ఇంతింతకాదని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చాగంరెడ్డి వీరనారాయణరెడ్డి ఆరోపణలు చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్దజొన్నవరం వద్ద కుందూ నదిలో మైనింగ్ అధికారులు అనుమతి లేకుండానే ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లతో తరలిస్తున్నారని ఆరోపించారు. గ్రామస్తులు ఇంటి అవసరమై ఇసుక తోలుకోవాలంటే పోలీసులకు ఫోన్ చేసి ట్రాక్టర్ యజమానులపై దాడి చేయించి, కేసులు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. జొన్నవరంలో అక్రమంగా గ్రావెల్, బెల్ట్‌షాపు ఆయన ఆధీనంలో నడుస్తున్నాయన్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. పెద్ద జొన్నవరంలో ప్రజాస్వామ్యం అమలు కావాలంటే పోలీస్, రెవెన్యూ శాఖలు నిజాయితీగా, నిబద్ధతగా పనిచేయాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న వీరనారాయణరెడ్డి

IN THE COURT OF THE HON'BLE 4th ADDITIONAL JUNIOR JUDGE : KADAPA

I.A.No. 487 OF 2022 IN O.S.No. 267 OF 2022

Vurimi Subba Rao, Son of Vurimi Subbarayudu, Having Died His L.R.'s
2) VURIMI HYMAVATHI, AADHAAR NO: 9326 4034 3606, Wife of late of Vurimi Subba Rao, Hindu, aged about 64 years,
3) Vurimi Veera Venkata Sai Chakravarthi, AADHAAR NO: 6951 5964 4770, Son of late of Vurimi Subba Rao, Hindu, aged about 24 years,
Both are residing Door No: 20/720-1, Co-Operative Colony, R.K.Nagar, Kadapa City.

...Petitioner/Purposed Plaintiff No: 2&3

Vs

GUDURU SREENIVASA RAO, Son of late Sreenivasulu Chetty, Hindu, aged about 65 years, residing at Door No: 20/909-1, Co-operative Colony, R.K.Nagar, Kadapa city.

...Respondent/Defendant

NOTICE TO RESPONDENT/DEFENDANT UNDER ORDER 22 RULE 3 C.P.C R & READ WITH SECTION 151 OF C.P.C

Where as the Petitioners/ purposed Plaintiffs No: 2 & 3 herein filed the above Petition/suit against you being Respondent/Defendant to implead them as Plaintiffs No: 2 & 3 to the suit being the legal heirs of the deceased Plaintiff and the said I.A/suit stand posted on 26-09-2023 for your appearance therefore you being the Respondent/Defendant here by instructed to appear before the Hon 'ble court on 26-09-2023 at 10-30 A.M sharp personally or through an Advocate, failing which the matter will be decide as Ex-parte.

//By Order of the Hon'ble Court//

S.MD.KHALEEL GHOUSE & P.ABBAS KHAN

Advocates For Petitioners/ Purposed Plaintiffs No.2 & 3